# కిమ్మత్రైన కర్మ

తను తిరుపతిచూసి అబ్బో చాలా రోజులైంది; కొన్నేళ్ళక్రితం ఎప్పుడో చిన్నప్పుడు. ఎంతగానో మారిపోయిందట. రైల్వేగైడ్‌లో చూస్తే తిరుమలలేదు టూరిస్టు ఆఫీసువారికి ఫోన్‌చేసి కనుక్కొంటే ఆపేరు గురించి వారి దగ్గర భోగట్టా లేదన్నారు. మద్రాసాఫీసుని వాకబు చేసి చెబుతానన్నారు. వారాపేరెరుగరట. త్రైసిమాల్ అనే వూరు వంద కిలోమీటర్ల దూరంలో వుందన్నారు. దాని దగ్గరలో "లాజీన" అనే పట్నం వుందట అక్కడ ఏరియల్ రైల్వే, హెలికాప్టర్ కర్మాగారం మొదలైనవి వున్నాయట జెనీవాలో అంతర్ జాతీయ టూరిస్టు కార్యాలయం ద్వారా తెలిసింది. "లాజీన" అనే దాన్ని, అరవై యేళ్ళ క్రితం బాలాజీనగర్ అనేవారనీ, అదే తిరుమల, తిరుపతి అని పిలువబడేదనీనూ. హెలికాప్టర్‌లో "లాజీన"లో దిగాడు శ్రీనివాసులు అక్కడ చుట్టూ ఎత్తైన భవనాలు, తీగెలు, స్తంభాలు, గర్డర్లు, జనరేటర్లు, రంగు రంగుల నీళ్ళ ఫౌంటెన్లు యురేనియమ్ గుట్టలు-ప్లాస్టిక్ చెట్లు, రబ్బర్‌వుడ్, ప్రిఫాబ్రిక్ చాక్‌గ్లాస్ భవనాలు తీగకి వ్రేళ్ళాడి కదిలే ఏరియల్ రైల్వేలో వెళ్ళి నాలుగు నిమిషాలలో హెలికాప్టర్‌లో పట్టణం మధ్యలోదిగి అక్కడి వింతలు, వినోదాలు సందర్శించి వెంకటేశ్వరస్వామి ఆలయం చూపమన్నాడు. వాళ్ళు ఆశ్చర్యం ప్రకటించారు దాన్నిగురించి వారికేమి తెలియదన్నారు. టూరిస్టు ఆఫీసువారు ఇచ్చిన పటాలలో ఆ ఆలయంలేదు దానికి బదులు, జలపాతాలు సందర్శించమన్నారు. వేర్వేరు ప్రాంతాలలోని మూడు జలపాతాలని వొకే చోటికి రప్పించి, అక్కడ వొక సరస్సు తయారుచేసి దానిమీద పడవలో విహరించి, వినోదించే ఏర్పాట్లు చేశారు. పడవలో వారికి పోకెట్ సినిమా పెట్టెలిచ్చారు. అవి అగ్గిపెట్టెలో వుంటుంది. పడవ స్విచ్‌కివైర్ తగిలిస్తే సినిమా అంతా ప్లాస్టిక్ తెర మీదికి వొచ్చేస్తుంది. పెట్టెలో రెండో అరపైకి లాగితే ధ్వని వినబడుతుంది. దూరంగా షూటింగ్ గాలరీవుంది. అక్కడ సినిమా షూటింగ్

జరుగుతుంది. ఎన్నెన్నో పెద్దచెట్లు అమర్చబడి వున్నాయి. "ఎనిమిదవ కొండ" అని "రస్టిస్టాన్" అనే కృత్రిమ మట్టితో మరోకొండ ఏర్పాటైంది. స్వింగింగ్ స్టెయిర్‌కేస్ అనబడే వుయ్యాలమెట్ల మీదుగా ఆ కొండ శిఖరానికి చేరుకోవచ్చు. అక్కడన్నీ కృత్రిమ తోటలు ఆటస్థలాలు. "మిచిస్టిక్" అనే కొత్త లోహంతో కట్టిన పెద్దభవనం వుంది. అందులో అంతర్ జాతీయ సమావేశాలు జరుగుతాయి. ఎందర్నడిగినా, ఆలయం విషయం ఎవ్వరూ చెప్పలేకపోయారు. నాలుగైదు ఎయిర్ కటింగ్ సెలూన్లున్నా, జుట్టు తీయించుకునేందుకు వాటిల్లోకి జనం ఎగబడ్డంలేదు. జుట్టుకొనేవారు లేరట. కృత్రిమ వెంట్రుకల కర్మాగారం వేణీపూర్‌లో వుందట ఈ సెలూన్లు మూసేసి, దీనికై మంజూరైన కోటి రూపాయల మొత్తాన్ని యంత్రపరికరాలలో పనికివచ్చే తీగెలుగా మార్చడానికి వొక పరిశోధనాలయాన్ని నెలకొల్పేటందుకు వినియోగిస్తున్నారట. శ్రీనివాసులుకి కోపం వచ్చింది. తిరుపతి పుణ్యక్షేత్రం—లక్షలాది భక్తులు దేశం నలుమూలలనుండివచ్చి స్వామికి ముడుపు చెల్లించి, తమ కోర్కెలు ఫలింపజేసుకొని వెళ్ళేవారు. ఆ ఆలయం కనబడదేం? అధికారులకి ఫిర్యాదుపత్రం పంపుకున్నాడు. పార్లమెంటులో కొందరిచేత ప్రశ్నలు అడిగించాడు. "అసలు అలాంటి ఆలయం వున్నదీ లేనిదీ కనుక్కొనేటందుకు వొక కమిటీని వేస్తున్నాం" అని ప్రభుత్వం ప్రకటించడం, ఆ కమిటీలో శ్రీనివాసుల్ని సభ్యునిగా వెయ్యడం జరిగింది. చారిత్రక గ్రంథాలనీ, శిల్పాలనీ, శిధిలాలనీ పరిశీలించారు. పై ప్రాంతాలనుంచి సాక్షులని తెప్పించి వారితో చర్చలు జరిపారు. ఆ కమిటీ ఏడేళ్ళు కృషి చేసి, "లాజీన" అనేది వెనక బాలాజీనగర్ అని వ్యవహరించబడినదని తేల్చారు. అక్కడ ఒక ఆలయం వుండివుండవచ్చును అని తేల్చి, పార్లమెంటుకు నివేదించారు. ఈ భోగట్టా సేకరించటం కోసం ఖర్చుఅయిన ఐదులక్షలు వృధా అన్నారు సభ్యులు. ఈ ఖర్చు ప్రభుత్వం భరించదన్నారు శ్రీనివాసులు దగ్గిర గుంజుకున్నారు.

"దైవాన్ని కనుక్కోవడం నావిధి— నాకు కొన్ని కోర్కెలున్నాయి. అవి ఫలించాయి. కొంతముడుపు స్వామికి డిబ్బీలో వేసి అంద

జేయాలి" అని శ్రీనివాసులు మరొక పత్రం ప్రభుత్వానికి పంపించాడు. ఆ ముట్టజెప్పేదేదో తమకే ముట్టజెప్పితే, ప్రజాహిత కార్యాలకి వినియోగిస్తాం. ముందు ఈ కమిటీకైన ఖర్చంతా తను భరించాలని సమాధానం పంపారు. అతనిదగ్గర అంత సొమ్ములేదన్నాడు. అట్లాగైతే అరెస్టు చేస్తున్నామని తెలియపరచి, ఒక ఉద్యోగిని ఆరెస్టు చేసేందుకు పంపించారు. ఆ ఉద్యోగి రైల్లో, ఎదురుసీట్లో కూర్చున్నాడు.

"నన్ను అరెస్టు చేస్తావట్రా—నీకెన్ని గుండెలున్నాయి; తంతాను చూసుకో" అంటూ శ్రీనివాసులు వొక్క-తోపు తన్ని పరున్న సీటుమీద నుండి క్రిందకిపడి, "అబ్బ, నొప్పి" అనుకొంటూ లేచి, కళ్ళు తుడుచుకొని బైటికి చూసేసరికి రైలు స్టేషన్‌లో నిలబడివుంది. తూర్పున వెలుగు రేఖలు మేఘాలని చీలుస్తూ బైటపడుతున్నాయి. తను దిగవల్సిన స్టేషన్ తొమ్మిదింటికిగాని చేరదు. "అమ్మయ్య" అని చిరునవ్వుతో టూత్‌పేస్టుకోసం సంచిలో తడుముతున్నాడు శ్రీనివాసులు. పెట్టెలో మిగతా జనం అతన్ని వింతగా చూస్తున్న సంగతి గమనించకుండా.

సూర్యోదయానికి గంటముందు—— తెల్లవారు జామున ప్రకృతిలో నిస్తబ్ధత అతనికి ఇష్టం. మనస్సులో ఏ ఆవేదనా వుండని ఘడియలవే—పిట్టలు, కీటకాలు, మేఘాలు, చెట్లు, మనుషుల మనస్సులు అన్నీ శబ్దం చెయ్యకుండా నిశ్చలంగా ఉండే సమయం అది. ప్రేమించిన వారినికూడా మరిచిపోయ్యే ప్రశాంత వాతావరణం.

రాత్రంతా తనకొచ్చిన ఉత్తరం గురించి ఆలోచించాడు. అతనికేమీ అర్థంకాలేదు. ప్లీడరుగారు పంపిన ఉత్తరం అది. ప్లీడరు పేరు ప్రకాశం. పుండరీకాక్షయ్యగారి తాలూకు కొంత సొమ్ము మీ పరమైంది వొచ్చి స్వీకరించమని అంతే ఉత్తరం ఇంకేవీ వివరాలు లేవు తన బంధుకోటిలో పుండరీకాక్షయ్య అనే వ్యక్తి వున్నట్లు అతనికి తెలియదు. అతనికి తల్లి తండ్రిలేరు. చిన్నతనంలోనే పోయారు తన బాల్యం తిరుపతిలో మేనమామ దగ్గర గడిచింది. తొమ్మిదవఏట ఆయనకి ఖరగ్‌పూర్లో ఉద్యోగం అయింది. మేనమామతో తనూ వెళ్ళి చదువుకొని, చిన్న ఉద్యోగంలో అక్కడే ప్రవేశించాడు జీతం రాళ్ళుతప్ప ఏ ఆస్తీ, ఆదాయములేదు.

ఇప్పుడు కొంత ఆస్తి సంక్రమించిందిట. ఎంతో తెలియదు ప్లీడరు ఉత్తరం చూసుకుని, ఫలానా బండికి వొస్తున్నానని టెలిగ్రాం ఇచ్చి బయలుదేరాడు.

ఈ ప్రయాణానికి కావల్సిన డబ్బులేదు అతనిదగ్గర. సరళని అడిగాడు. ఇచ్చింది. బయలుదేరాడు.

రైలు ఎక్కేవరకూ సరళ తనకెంతగా కావాల్సి వొచ్చిందో తెలిసొచ్చిందికాదు పుండరీకాక్షయ్య, ప్లీడరు—అవి కేవలం పేర్లు—వాటివెనుక రక్తమాంసాలతో నిండిన మనుషులున్నట్లు అతను వూహించలేదు వాళ్ళని వాళ్ళ ద్వారా తనకి కలిగే ఆస్తినీ, ఈ ఊహల్లోనుంచి నెట్టివేసి, రైల్లో పడుకోగలిగినా, రెప్పలకింద మసలుతూ నిద్రపోనివ్వలేదు సరళ.

సరళకి కుట్లపనులు నేర్పే పాఠశాలలో చిన్న ఉద్యోగం. వాళ్ళ ఇల్లు తనున్న వీధిలోనే ఆమెతో దూరపు చుట్టం వొక ముసలామెవుంది. ఇకెవ్వరూ నా అన్నవాళ్ళు లేరు. తనకి మల్లేనే కాని ఆమెకి పెండ్లయింది. తనకి అవలేదు. పెండ్లయినా అవనట్టే ఎందుకంటే, పెండ్లయిన తర్వాత ఆమె భర్తతో వుండలేదు—మొదట్లో కొద్దిరోజులు తప్ప. ఆమెకిప్పుడు పదిహేనుసంవత్సరాల వయస్సు భర్తకి ఈమెపై అయిష్టం తిట్టడం, కొట్టడం, వుండేది. కారణం—అతనికి వొదినగారితో సంబంధం వుండేదిట. కోపంలో వారిద్దరూ ఏకమై, యీమెను ఏమన్నాచేస్తారో ఏం జరుగుతుందో నని భయపడి, ఆమె బంధువులు, తమతో తీసుకొచ్చేశారు భర్త కూడా ఈమెను తెచ్చుకోవాలన్న అభిలాష చూపలేదు మళ్ళా రాకపోవడం మంచిదని కబుర్లు పంపేవాడట. ఆమెని భర్త విడిచేసి ఏడు సంవత్సరాలైంది. మనోవర్తి రాబట్టాలని ప్రయత్నాలు జరిగినా, వాటి ఫలితం ఏమిటో తనతో ఆమె ఎప్పుడూ ప్రస్తావించలేదు భర్త డబ్బున్నవాడు.

"డబ్బున్నవాళ్ళంటే నాకు భయం" అంది సరళ వొకసారి కళ్ళను కిందకిదించి మాట్లాడుతూ. తనకేసిచూడదు. ఏవో సిగ్గు, భయం. కళ్ళు కిందికి దించుకుంది. నిండైన, గుండ్రవైన కనురెప్పల కింద బైటికిరాలేని ఒక వెలుగుంది

ఆమెను రెండేళ్ళుగా ఎరుగున్న నిజంగా ఆమెను

గురించి తనకేమీ తెలియదు. ఎప్పుడు ఎట్లా స్నేహం కలిసిందో స్పష్టంగా జ్ఞప్తికి రాదు. ఒకమారు, పిల్లలు ఆడుకునే స్థలాన్ని ఆవివున్న గోడదగ్గర చెట్టునీడలో నిలబడి కొంత సంభాషణ. మొహం కోలగావున్నా, సరళ నుదురు కొస్త చిన్నది విశాలంగా, గుండ్రంగా కనబడదు. చిరు వెంట్రుకలు నుదిటిని పీడించి, వ్రేల్లాడుతూ నుదుటిని మరింత చిన్నదిగా కనబడేటట్లు చేస్తాయి. అవి మినహా ఆమెలో ప్రతి అవయవమూ తనకి నచ్చుతాయి. నిండైన గుండ్రని భుజాలు-శరీరంలో పొందికని అవయవాలకూర్పుని సమన్వయపరిచే నడుం. చిరునవ్వు కోసం వోపిక మిగుల్చుకున్న పెదవులు కిందికి వాల్చిన చూపులో వైచిత్రి అసలు ఆమెలో ఒక అమాయకత్వం వుంది అది శరీరానికి సంబంధించినది. శరీరాన్ని పట్టుకుని కదిపి, వూపి, అది నిజమో కాదో తెలుసుకోవాలని, అతని చేతులు పీకుతాయి. ఒకసారి ఆమె ఎడమ భుజంపైన తన కుడిచెయ్యి పడింది. తీసేసింది.

ఏదో పెళ్ళిళ్ళ విషయం ఒచ్చింది.

"అన్ని సక్రమంగా వుండి...ఏ అవలక్షణమూ లేని మామూలు పిల్లలకే పెండ్లి కావడంలేదు యీరోజుల్లో. ఇంక నాలాంటి భర్త విడిచేసినదాన్ని ఎవరు చేసుకుంటారు?" అన్నమాట తనకి బాగా జ్ఞాపకం. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరగడం చూశాడు.

మరొకరాత్రి- ఆంధ్రసంఘంవారు ఏవో ప్రదర్శనలు చేశారు. అదిచూసి అందరూ కార్లో వస్తున్నారు. మధ్యలో కారు రిపేరు చెయ్యాల్సి అందరూ దిగి, గంట వేచివుండాల్సివొచ్చింది. తనూ, ఆమె అల్లా నడుచుకుంటూ వెళ్ళారు. వారిద్దరూ ఏకాకులు. జీతం తప్ప, ఏ రకం ఆస్తిపాస్తులూ లేని వాళ్ళు. తమకే డబ్బుంటే ఏం చేద్దురో చెప్పుకున్నారు.

"నాకేగనక డబ్బుంటే, నాలుగయిదు ట్యుమిషన్లు కొని స్వంతంగా ఒక పాఠశాల నడిపి, నేనే ప్రిన్సిపాల్‌గా వుందును."

"నాకు డబ్బుంటే...." అన్నాడు శ్రీనివాసులు.

"చెప్పండి....పెండ్లి చేసుకుంటారా?"

కథా నిలయం

"ఎట్లా గ్రహించారు....?"

"మీ చూపులే చెప్తున్నాయిగా"

"అమ్మో, ఏమోననుకున్నాను డబ్బున్న వ్యక్తంటే మీకు గిట్టదు! అవునా?" అన్నాడు.

"ఎట్లా గ్రహించారు...."

"మీ చూపులే చెప్తున్నాయిగా."

"నా మొహం అంత కోపంగా ఉంటుందా?"

"నాకు డబ్బులేదుగా....కర్మానుసారంగా నాకు డబ్బొచ్చి పడిందనుకోండి అప్పుడెంత కోపంగా చూస్తారో చూడాలనివుంది" అన్నాడు.

"డబ్బుంటే నాతో మాట్లాడతారా?"

నే మాట్లాడినా మీరు మాట్లాడరుగా-మీకే కర్మానుసారంగా కొంత డబ్బు వచ్చిపడిందనుకోండి....మీరు మాట్లాడుతారా నాతో" అంటూ ఆమె చేతిని అరచేతిలోకి తీసుకోడం ఆమె చివాలున లాగేసి దూరంగా వెళ్ళడం జరిగాయి.

ఆమె చేతిలో చర్మంకింద రక్తనాళాలు కదలడం, నాడిని కదుపుతూ రక్తం పరవళ్ళతొక్కే-నస్పర్శ తన అరచేతిని ఇంకా విడువలేదు తనచేతికేసి చూసుకున్నాడు శ్రీనివాసులు. అల్లా చేసినందుకు తనమీద కోపం వొచ్చింది. ప్రేమ మనసులో ఉండాలంటారు. "అలా చెయ్యకు" అని మనస్సు తన చేతిని శాసించినా, లెక్కచెయ్యక ఆ చెయ్యి అల్లాచేస్తే తన మనస్సు ఆధిక్యత ఎందులో ఉన్నట్లు! మనస్సు చేతిని శాసిస్తుందా? లేక చెయ్యి చేసినదాన్ని కర్మద్వారా సమర్థిస్తూ మనస్సు కారణాలు వెదికి సమాధానపడుతుందా?

మళ్ళా ఎప్పుడో ఒక ఉదయం తలంటు పోసుకుని జుట్టుముడికి తువ్వాలు చుట్టి పలకరించిన దృశ్యం, అతని రెప్పల మీద సోదాచేస్తోంది. సంభాషణ జ్ఞాపకం రాదు.

"మనస్సుని కర్మ శాసిస్తుంది. ఒప్పుగుంటారా? కాని శరీరంపై కర్మకి అధికారంలేదు, మనస్సుద్వారాతప్ప, కాబట్టి, చక్కదనానికి కూడా కర్మే బాధ్యురాలు."

"కర్మని ఆడదాన్నిచేశారు ఆడదానికి ఆస్తిలో భాగం లేకపోవడం వల్లనేగా...." అంది సరళ.

"ఆడదానికికూడా ఆస్తిలో భాగం ఉండాలని కొత్త బిల్లు ఒకటి తయారవుతోందిగా" మళ్ళా ఎందుకో అప్రయత్నంగా, ఆమె భుజంపైన చెయ్యిపడింది.

"కిమ్మైతైన కర్మే" అని విసురుగా తోసేసింది తన చేతిని. చేతినిచూసి జాలిపడ్డాడు. దానికర్మ! స్పృశించేందుకు నోచుకోలేదు. కర్మ! కిమ్మతైన కర్మ.

రైలు నిలిచింది. తను దిగాల్సిన స్టేషను....దిగాడు. ప్లీడరుగారు మందహాసంచేసి, పలకరించి, తీసుకువెడుతున్నాడు. బైట జట్కాబండిలో ఎక్కారు.

"పుండరీకాక్షయ్య స్వర్గస్థులైనారు ఈ ఉదయమే. సుఖంగా కన్ను మూశారు. విషూచి. తొంభయినాలుగేండ్లుట" ఏమనాలో తెలీడంలేదు శ్రీనివాసులికి.

"అయ్యో పాపం."

"ఏమీ విచారించాల్సిన పనిలేదు. కర్మ కానివ్వండి మాటాడు కుందాం. మీరే జరపాలి."

శ్రీనివాసులికి భయమేసింది. తను కర్మచెయ్యడం ఏమిటి?

"వారి బంధువులు లేరా?

"ఎవ్వరూ లేరు. మీరొక్కరే."

"నే నాయన్ని ఎరగను. ఎప్పుడూ చూడలేదు."

"మీది తిరుపతటగా."

"చిన్నప్పుడు, ఏడెనిమి దేళ్ళుండగా అక్కడ వుండే వాళ్ళం. తర్వాత నే నెప్పుడూ తిరుపతి వెళ్ళలేదు. నా కెందుకు వ్రాశారు? అవి అడిగాడు.

ప్లీడరు ప్రకాశం ఇల్లా చెప్పాడు.

పదిహేను రోజుల క్రితం మైకంలో పడేముందు, నాకు కబురు చేస్తే వెళ్లాను. దగ్గరలో వున్న ప్లీడర్ని తీసుకురమ్మన్నాడట.

ఆయన్ని నేను ఎరగను. "నేను చచ్చిపోతాను ఆ స్తిపాస్తులేమీలేవు. దానిది-భాగ్యవతిది-తన స్వంతం కొంత రొక్కం, నగలు ఎక్కడో దాచి వుంచింది. ఆ విషయం ఇప్పుడే జ్ఞాపకం వొచ్చిందినాకు-ఎప్పుడో వొక సారి అంది. అదంతా తిరుపతిలో శ్రీనివాసులు అనేవాడికి చేరాల్సిందేనని. ఇల్లంతా వెదకండి" అన్నాడు పుండరీకాక్షయ్య వెదికాం. భోషాణం వున్న చోట తవ్వితే రెండువేలరూపాయల రొక్కం, ఓ పదివేల ఖరీదైన నగలు దొరికాయి తిరుపతిలో వాకబుచేయగా మీరు అక్కడ పుట్టినట్లు; ప్రస్తుతం ఖరగ్‌పూర్లో ఉద్యోగం చేస్తున్నట్లూ భోగట్టాదొరికింది. అందుకే టెలిగ్రాం ఇచ్చాను. అవులే మీరువార్ని ఎరగరా?"

"ఎరగను"

"అదృష్టవంతులు. ఆమె స్త్రీధనం అంతామీదే."

ఇంటిదగ్గర బండినిలిచింది. ఊళ్ళోజనం వో యాభై మంది పోగై నారు. మధ్య పుండరీకాక్షయ్యగారి శవం. కర్మకాండ దహనక్రియలు తనే చేశాడు. పుండరీకాక్షయ్య వృద్ధుడు సన్నటిమనిషి గంటలో అంతా ముగి సింది.

ఆ సాయంత్రం పెద్దలు నలుగురు పోగై భోషాణంకింద సంచిలో నోట్లు, వెండిబంగారం నగలు పైకితీశారు ముప్పై ఏళ్ళనాటి సొమ్మతో తనకింతడబ్బు-కర్మానుసారంగా వొచ్చి పడింది. సరళకి తెలిస్తే ఏమది టుందో! టెలిగ్రాంయిస్తే? సరళ తనని పెండ్లి చేసుకుంటుందా? ఇన్నాళ్ళు

ఆ విషయం ప్రస్తావించడం అంటే భయంగా వుండేది. మొగుడొచ్చి తంతాడేమో, మొగుడు విడిచేసిన దానితో పెళ్ళేమిట్రా అంటారేమో నలుగురూ.

తనకింత ఆస్తి సంక్రమించిందని తెలిస్తే, ఆమె ఇష్టపడదుగా ఆ విషయం ఆమెకి తెలియపరచకూడదు. నగల సంచిలో నబ్బుబిళ్ళ పెట్టి తీశారు. అందులో వుంగరం గొలుసు వున్నాయి. వాటడుగున ఉత్తరం వుంది. అది చదివి ప్రకాశం అనే దూరపుబంధువు బిగ్గరగా నవ్వడం మొదలెట్టాడు. ఏమిటీ విశేషం అని అడిగారు నలుగురూ.

"ఈ డబ్బు, యీ నగలు తిరుపతిలో ఏడుకొండల స్వామికి చేరాలని ఆవిడ కోరిక. ఏడుకొండలవాడిని, బాలాజీ, శ్రీనివాసులు అనికూడా అంటారు. ఆ శ్రీనివాసులుకి చెందాలట—ఈయనకి కాదు. పుండరీకాక్షయ్యగారు మతిమరుపువల్ల తిరుపతిలో శ్రీనివాసుల్ని ఒకమనిషి అనుకొని మనతో చెప్పడంవల్ల ఈ గొడవంతా జరిగింది. బాగానేవుంది." అన్నాడు. నలుగురూ నవ్వుతున్నారు. శ్రీనివాసులు అమ్మయ్య అనుకొని పైకినవ్వేసినా లోపల తనకి కానీముట్టలేదని తెలిసేసరికి వొక దిగులు రగులుకొంది.

తన రాకపోకలకి, కర్మకి అయిన ఖర్చులు మినహాయించి మిగతా సొమ్మును స్వామికి అందజేస్తామని హామీయిచ్చాడు ప్రకాశం. అమ్మయ్య అనుకున్నాడు శ్రీనివాసులు. ఈ విషయాలన్నీ తెలియపరుస్తూ సరళకి ఉత్తరం వ్రాశాడు.

నువ్వనుకున్నంత కిమ్మత్తైన కర్మ కాదులే" అన్న వాక్యముతో ఉత్తరం ముగించాడు. పదవరోజు పుండరీకాక్షయ్యగారి దూరపు చుట్టాలు, ఆయన భార్య భాగవతమ్మగారి దూరపుచుట్టాలూ, వొకపదిమంది వచ్చారు. "భాగ్యవతమ్మగారు—తన నగలు, వస్తువులు తిరుమలలో శ్రీనివాసులికి అర్పిస్తున్నట్లు వ్రాసింది, నిజమే. దానికి తిరుగులేదు కాని, ఎన్ని నగలో, ఎంత డబ్బో ఆమె వివరించలేదు కావున ముడుపు చెల్లించడం కోసం వొకనగ డిబ్బీలోవేసి మిగతా వాటిని తమకి పంచడం భావ్య"మని ఆవిడ చుట్టాలు ప్లీడరు ప్రకాశానికి విన్నవించుకున్నారు.

"ఈ సంచిలో ఉన్నవన్నీ అవి వ్రాసింది ఆవిడ. నేనేం చెయ్యను?" అన్నాడు ప్రకాశం.

"అప్పటేమట్టుకు, ప్లీడరు ఫీజులు కర్మచేసిన శ్రీనివాసులు రైలు ఖర్చులు వగైరా యీ సొమ్ములోనుంచే మినహాయిస్తున్నారుగా—ఆ విధంగానే మాకూ కొంత ముట్టచెప్పి, మిగిలినవాటినే స్వామికివ్వండి, మంచిది" అని ఒకరు సూచించినా ఒత్తిడి చేయడానికి జంకుతున్నారు. కారణం స్వామికి చెల్లించవల్సిన సొమ్మును మళ్ళించి, తాము లాక్కుంటే స్వామి ఆగ్రహించి తమకేమన్నా అపకారం సల్పుతాడేమోనన్న భయం వారిలో లేకపోలేదు. కాబట్టి ఆ విషయం కొక్కించక, ప్లీడరుచేసిన తీర్పుప్రకారం కట్టుబడి వుంటామని హామీయిచ్చారు తన ప్రయాణంఖర్చులు, కర్మకైన ఖర్చులు యీ స్వామి సొమ్ములోనుంచి తీసుకుంటే, తనకి హాని జరుగుతుందేమోనన్న భయం శ్రీనివాసులుకు వుంది. ఎందుకైనా మంచిదని మరికొంతడబ్బు, ఎక్కడైనా తీసుకొని పంపవల్సిందిగా సరళకి టెలిగ్రాం ఇచ్చాడు. తన ఫీజు వగైరా యిందులోంచి తీసుకుంటే ఏం జరుగుతుందోనని ప్లీడరుకి ఆదుర్దా కలిగింది గావును, భాగ్యవతమ్మగారి నగలు సంచి అల్లాఉంచి, పుండరీకాక్షయ్యగారి ఆస్తిపాస్తుల విషయం ఆరాలు తీశాడు. బ్యాంకులో కొంతడబ్బు వున్నట్లు తేలింది. ఖర్చులన్నిటికి అది సరిపోతుంది. పైన ఇంకేమీ మిగులు. భూములు? కరణం, మునసబులను వాకబు చేశాడు. బంధుకోటిలో వారిని అడిగాడు. ఆయనకు ఉద్యోగమూ సద్యోగమూలేదు. ఏనాడో భూమిని అమ్మేసివుంటాడన్నారు. చాలా కాలంగా ఆయన ఒకామెను—వొంటామెను-పెట్టుకున్నాడట. ఆమెనడిగితే, ఆమె చనిపోయిందట ఈ సంప్రతింపులతో విసుగెత్తింది శ్రీనివాసులికి. ఏముంటే తనకెందుకు? లేకుంటే తనకెందుకు? తన రైలు ఖర్చులు, కర్మ ఖర్చులు ముట్టాయి ఇంక ఇంటికెళ్ళొచ్చు.

"రైలు ఎన్నింటికండీ—నాకో బండిని తప్పించి వెడతారా?" అని అడిగాడు ప్రకాశాన్ని.

"మరొక్కరోజుండండి. భూమి విషయం వాకబుచెయ్యమని పై గ్రామానికి మునసబు బావమరది గుర్నాధాన్ని పంపాను. సాయంత్రానికి తిరిగివొస్తాడు."

"నాకు వారి భూములపై అపేక్షలేదు, నన్ను వొవియ్యండి." అన్నాడు.

"మీకు లేకపోయినా, మాకుంటుందిగా. ఓ రహస్యం చెప్పనా. రావల్సిందని మీకు కబురుపంపాక, పుండరీకాక్షయ్య తన స్వార్జితాన్ని గురించి ప్రస్తావించాడు. ఆ మాటలు జ్ఞాపకం రావడంలేదు కర్మ. మీకు వ్రాశాక, నాలుగైదు రోజులకి ఆయనకి స్పృహ వొచ్చింది. తెలివిగా మాట్లాడాడు, గట్టి ప్రాణం. "నా పెళ్ళాం శ్రీనివాసులకిస్తే నా ఆస్తి ఆ శ్రీనివాసులు పెళ్ళానికిస్తాను. నేనేనా అంతతక్కువ తిన్నవాడ్ని" అన్నట్లు జ్ఞాపకం" అన్నాడు ప్రకాశం.

"నాకు పెండ్లికాలేదు. ఇంక ఆ బెంగ దేనికి?"

"అముక్క నేను ఆయనతో అన్నాను. "ఆ శ్రీనివాసులుకి పెండ్లి కాలేదటలెండి, అన్నట్లు జ్ఞాపకం. దానికి సమాధానంగా ఆయన ఏమన్నా దంటె, "లేకపోతేనేం— చేసుకున్న తర్వాత, అతని భార్యకు చెంద కూడదని మీలా లో ఏమన్నా వుందా?" అని ప్రశ్నించి వికటంగా నవ్వడం సాగించిన గుర్తు. అది చివరి ప్రేలాపనో, సంధివాగుడో గ్రహించలేక పొయ్యాను." అన్నాడు ప్రకాశం.

ఆ మర్నాడు ఉదయం కబురొచ్చింది— పుండరీకాక్షయ్యగారిది ఎకరం ఆరువేలుచేసే కిమ్మతైన నాలుగెకరాల భూమివున్నట్టు. అభూమి తాలూకు పత్రాలకోసం ఇల్లంతా గాలించడం మొదలెట్టాడు ప్లీడరు. పాత పత్రాలు. ఉత్తరాల కట్టలు దొరికాయి. నలుగురైదుగుర్ని వినియోగించి, వాటిల్లో వివరాలు విడివిడిగా పొందుపరిచాడు.

"రైలు ఎన్నిటికండీ—నాకో బండి తెప్పించరూ" అన్నాడు శ్రీనివాసులు. గోడ గడియారంకేసి చూశారు. ఆరింటిపై అది నిల్చిపోయింది. కీ యివ్వడానికి అద్దంతీశాడు ప్రకాశం; తాళంచెవి మూలగ కాగితంలో

దొరికింది. ఆ కాగితం పుండరీకాక్షయ్య వ్రాసిన వీలునామా.

ఆత్రుతతో చదివాడు ప్రకాశం. తన నాలుగెకరాల భూమి కర్మ చెయ్యడానికి రానున్న శ్రీనివాసులు భార్యకి దక్కాలని దాని సారాంశం. ఎటొచ్చి, ఆ శ్రీనివాసులు చేసుకోబోయే ఆమె, యిదివరకు పెండ్లయి, భర్త విడిచేసినదై వుండాలి అన్న నిబంధన వొకట్టుంది. "అట్లాకాని పక్షమున.... ఆ చివరి వాక్యం పూర్తికాదు. సంతకంవుంది.

"ఇదెట్లా సాధ్యపడుతుంది? మొగుడు విడిచేసిన ఆమె కోసం మీరెక్కడ తిరుగుతారు?" అన్నాడు ప్లీడరు.

శ్రీనివాసులు నవ్వుతున్నాడు. అతనిలో సంతోషం మొహమంతా ఆవరించింది.

"ఆయన అల్లాంటి నిబంధన ఎందుకు పెట్టారు?" అని అడిగాడు.

"ఎవరు చెప్పగలరు. ఈ ముసిలాళ్ళకి ఏక్షణంలో ఏవికారం బైలు దేరుతుందో చెప్పలేం. దారినిపొయ్యే దానయ్యకి వ్రాసేసి వూరుకుంటారు ఆస్తినంతా" అన్నాడు ప్రకాశం. బంధుకోటిలో వొకరవి కదలెయ్యగా దాని రహస్యం తెలిసింది పుండరీకాక్షయ్య పెండ్లిచేసుకున్న భాగ్యవతమ్మ- భర్త వొదిలేసినామేనవి, వీలునామాద్వారా తాను ఒకరకం సంఘసంస్కారం సాధించాడు. "వెనుకటి రోజుల్లో—విధవా వివాహం సంఘసంస్కారం. ఈ రోజుల్లో– మొగుడు చావడు. బతికే వుంటాడు. కాని పెండ్లాన్ని ఏలుకోడు. విడిచేస్తాడు. అట్లా పరిత్యజించబడిన స్త్రీలను ఉద్ధరించడం యీనాటి సంఘసంస్కారం. కాని, అట్లాంటివాళ్ళు మనకు కావాలనుకున్నప్పుడు దొరుకొద్దూ!" అన్నాడు ప్రకాశం.

"ఐదారేళ్ళు భార్యని వదిలేసి తిరిగి తన దగ్గరకి తెచ్చుకోటానికి ఏ ప్రయత్నమూ చేయనప్పుడు, భార్యకోరితే, విడాకులియ్యడానికి, ఏదన్నా అభ్యంతరం వుంటుందంటారా?" అని అడిగాడు శ్రీనివాసులు.

"ఉండకూడదు. కాని, విడాకులివ్వడం భర్త ఇష్టం. పేచీలు పెట్టి, తన దగ్గర తీసుకోడానికి యత్నాలు చేసినట్లు సాక్ష్యాలు, ఋజువులు

సృష్టించవొచ్చు. జీవితకాలం ఏడిపించుకు తినొచ్చు. అందుకనే మనలో చాలామంది, విడాకులూ కోర్టులు లేకుండా, గప్‌చిప్‌గా రిజిస్ట్రేషను వివాహాలు చేసుకుంటున్నారు. ఏం మీకేమన్నా అట్లాంటి వుద్దేశం వుందా?"

"నేనెరుగున్నాకామెను ఏడేళ్ళగా భర్త విడిచేశాడు. ఆమె దూరంగా వుండటమే అతను కోరింది. ఆమె మళ్ళా ఎవర్నైనా చేసుకునే పరిస్థితులు కలిగిస్తే బాగుంటుందనుకున్నారు."

"ఎవరో ఎందుకు— మీరే చేసుకోవచ్చు, ఇష్టమైతే"

"చాలా యిష్టం"

"మిగతావి నేచూసుగుంటాగా. పుండరీకాక్షయ్య వీలునామాలో అగ్నిసాక్షిగా కట్టుకొన్న వ్యక్తికే ఆస్తి చెందాలని నిబంధనలేదుగా" అన్నాడు ప్రకాశం.

జట్కా బండొచ్చింది స్టేషనుకు బయలుదేరారు. ఎదురుగా మరో బండి నిల్చింది. అందులోనుంచి సరళ దిగింది.

"ఎప్పుడు రావడం? ప్రయాణం బాగా జరిగిందా?" అంటూ శ్రీనివాసులు ఆమె భుజంపై చెయ్యివేసి పరామర్శించి ఆహ్వానించాడు. ఆమె చేతుల్ని తీసివెయ్యలేదు. మందువాలో విషయం చెప్పాడు. అతని చెయ్యి పట్టుకుంది. శ్రీనివాసులు తోసేశాడు.

"తిరుమలస్వామి సన్నిధిని"

సరళ కళ్ళు కిందికిదించి నవ్వింది. వొంగిచూశాడు— రెప్పకింద విప్పుకున్న వెలుగుతెరను.

రచనకాలం : 1963 మార్చి 20–22

ప్రచురణ : స్రవంతి 1963 ఏప్రిల్